
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 24 ఆగస్టు 2024 | 5



సర్‌ప్రైజ్ విజిట్లు చేస్తా : సీఎం చంద్రబాబు

కొత్తపేట, ఆగస్టు 23: రాష్ట్రంలో ఎక్కడ అవినీతి జరిగినా తనకు సమాచారం వస్తుందని, ఆ ప్రాంతాల్లో సర్‌ప్రైజ్ విజిట్లు చేస్తానని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అధికారులు అందరూ నిబద్ధతతో పనిచేయాలి. నేను ఏ ప్రభుత్వ కార్యాలయానికి వస్తానో ముందుగా ఎవ్వరికీ తెలియనివ్వను. ప్రజలతో మమేకమై ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఆయన సూచించారు.





ప్రజల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు



పల్లెలను అభివృద్ధి చేస్తా : వానపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న చంద్రబాబు



జై చంద్రబాబు : చంద్రబాబుకు ప్లకార్డులతో మహిళల స్వాగతం



మీకు నేనున్నా : గ్రామస్తులకు అభయమిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

సర్పంచ్ అడిగారని.. వానపల్లికి రూ.10 కోట్లు

కొత్తపేట, ఆగస్టు 23 : సీఎం చంద్రబాబునాయుడు వానపల్లిలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ పల్లి భీమారావును మెచ్చుకున్నారు. మూడుసార్లు సర్పంచ్‌గా పనిచేస్తున్నాడంటే అతని అవినీతిరహితమైన పరిపాలనను ప్రజలు గుర్తించారన్నారు. అలాగే వానపల్లి అభివృద్ధికి 16 విభాగాల పనులకు సంబంధించి సుమారు రూ.10 కోట్లు అవుతాయని తనకు నివేదిక ఇచ్చారని, వాటన్నింటినీ మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలతో మమేకమై పనిచేస్తేనే ప్రజలే పట్టంగడతారని అన్నారు.



వానపల్లి గ్రామస్థులకు చంద్రబాబు అభివాదం

పల్లెకొచ్చిన.. చంద్రుడు

వానపల్లిలో చంద్రబాబు వరాల జల్లు

అమలాపురం/కొత్తపేట,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పల్లెకు చంద్రుడొచ్చాడు..వెలుగులు తెచ్చాడు.. మీ సమస్యలన్నీ పరిష్కరిస్తానని వానపల్లిలో వరాలజల్లు కురిపించాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలంలోని వానపల్లిలో శుక్రవారం జరిగిన గ్రామసభలో సీఎం చంద్ర బాబు పాల్గొని మాట్లాడారు. పెట్టుబడి తగ్గించి ఆదాయం పెరిగేలా రైతులు వినూత్న ఆలోచనలతో ముందుకు వెళ్లాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా పెట్టుబడిని తగ్గించే ప్రకృతి సేద్యం చేసేలా ప్రోత్సహిస్తాం. రాష్ట్రంలో వర్షాలు పడడం శుభసూచకం. రాబోయే రోజుల్లో కరువు అనేది రాదు. ఇక్కడే పోలవరం ప్రాజెక్టు ఉంది. వీలైనంత త్వరలో దాని పూర్తిచేసి గోదావరి జిల్లాల ప్రజలకు మూడు పంటలకు నీళ్లిస్తామని స్పష్టంచేశారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ఇటీవల రూ.1,670 కోట్ల ధాన్యం బకాయిలను రైతులకు చెల్లించాం. 48 గంటల్లోనే ధాన్యం బకాయిలు చెల్లించే విధానాలతో ప్రభుత్వం ముందుకు వస్తోందని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు రూపకల్పనచేసిన తానే.. ఆయా సంఘాల్లో ఉన్న మహిళల అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానని చెప్పారు. గ్రామాల్లోని మహిళల ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధి పొందుతూ ఉన్నత స్థానంలో ఉన్న వ్యక్తులు కింది స్థానంలో ఉన్న వారిని దత్తత తీసుకుని వారి ఆదాయం పెంచే విధంగా సహకరించాలని సూచించారు. జన్మభూమి స్ఫూర్తితో ఈ తరహా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. సభలో చంద్రబాబు ఎవరి పేర్లను ప్రస్తావించకుండానే ప్రసంగాన్ని ముగించేశారు. గ్రామసీమల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఇస్తున్న అధిక ప్రాధాన్యతలను మాత్రం సభలో పదేపదే ప్రస్తావించడం ద్వారా ప్రజలను ఆకట్టుకోగలిగారు.

రెండున్నర గంటలపాటు గ్రామసభ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాకతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. రెండున్న గంటలపాటు సభ జరగ్గా గంటా 20 నిమిషాలపాటు చంద్రబాబు ప్రసంగం కొనసాగింది. మధ్యాహ్నం 2.20 గంటలకు అయినవిల్లిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్న కాన్వాయ్‌లో వానపల్లికి మధ్యాహ్నం 2.50 గంటలకు వానపల్లి చేరుకున్నారు. అక్కడ నాయకులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. వానపల్లి పళ్లాలమ్మవారి ఆలయంలోకి వెళ్లిన చంద్రబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం నేరుగా సర్పంచ్ పల్లి భీమారావు అధ్యక్షతన గ్రామసభ జరిగే వేదిక వద్దకు చేరుకున్నారు. సర్పంచ్, ఏపీడీల ప్రసంగం తరువాత నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు గంటా 20 నిమిషాలపాటు అనర్గళంగా ప్రసంగించడంతో ఎమ్మెల్యే బండారు, ఎంపీ హరీష్‌మాధుర్‌లకు మాట్లాడే అవకాశం రాలేదు. చంద్రబాబు ప్రసంగం తరువాత గ్రామస్తుల్లో కొందరికి అవకాశం కల్పించారు. చంద్రబాబు సభావేదికపైకి రాకముందు మాలమహానాడుకు చెందిన కొందరు కార్యకర్తలు సభలోకి ప్రవేశించడంతో వారిని గుర్తించిన పోలీసులు తక్షణమే సభాప్రాంగణం నుంచి బయటకు తీసుకెళ్లారు. వేదికపై కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు ఉన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి వేదికపై సీటు లేకపోవడంతో మీటింగ్ జరుగుతున్నంతసేపు నిలబడే ఉన్నారు. సభా వేదిక పక్కనే ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, గిడ్డి సత్యనారాయణ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, ఆకుల రామకృష్ణతో సహా అనేకమంది కీలక నాయకులంతా సభావేదిక పక్కనే కుర్చీల్లో ఆశీనులు కావడం కనిపించింది.

- గ్రామాల రూపురేఖలు మారుస్తా
- డ్వాక్రా మహిళల అభివృద్ధికి కృషి
- రైతులకు అండగా ఉంటా
- మూడు పంటలకూ నీళ్లిస్తా
- పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తా
- తోటివారిని దత్తత తీసుకోండి
- ఉమ్మడి జిల్లాలో సీఎంగా తొలిసభ సక్సెస్



సీఎంతో రేజీనాయుడు



మీ వెంటే బాబు : గ్రామసభకు హాజరైన జనం



బాబుతో పోలవరం ప్రాజెక్టు అధికారి



బాబుకు యువకుడి జ్ఞాపిక



సీఎంకు సమస్య విన్నవిస్తున్న వృద్ధ దంపతులు



లక్ష్మణరావుకు అభినందన



దివ్యాంగుడి సమస్య వింటున్న చంద్రబాబు

మా గ్రామంలో ఫ్యాక్టరీ పెట్టించండి సార్..

ఒక యువకుడి కోరిక.. కలెక్టర్‌కు సీఎం ఆదేశాలు

అమలాపురం/కొత్తపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గ్రామసభలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఓ యువకుడు తాను మాట్లాడతానని పెద్దగా అరిచాడు.. ఇది గమనించిన సీఎం అతడిని వేదికపైకి పిలిచి మైకు ఇచ్చారు. అతను ఏఐ వస్తుంది కదా సార్ ఏం చేస్తారని ప్రశ్నించాడు. ఇంతలో మరో యువకుడు మాట్లాడేందుకు వేదిక దగ్గరికి వచ్చాడు. ఇటు రావయ్యా అంటూ అతడిని పిలిచి బాబు మైకు అందించారు. వేదికపై పాల్గొన్న అందరి పేర్లు సంబోధిస్తూ ఏలూరి శ్రీనివాసధనరాజు (రేజీనాయుడు) ప్రసంగాన్ని ప్రారంభించాడు. అక్కడే ఉన్న మహిళలను చూపించి వీరంతా ఈ ఊరి నుంచి సుమారు 40 కిలోమీటర్లు వెళ్లి రవళి స్పిన్నింగ్ మిల్‌లో షిఫ్టుల వారీగా పనులు చేస్తున్నారు. ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయి. ఇక్కడే ఏదైనా మహిళలకు ఉపాధి కలిగే ఫ్యాక్టరీని ఏర్పాటు చేయండని అభ్యర్థించాడు. దానిపై చంద్రబాబు స్పందించి ఇక్కడ మహిళలకు ఉపాధి కలిగేలా ఫ్యాక్టరీ ఏదైనా నెలకొల్పేందుకు చర్యలు తీసుకోండని కలెక్టర్‌కు సూచించారు. ఎంతో మహిమగల అమ్మవారు పళ్లాలమ్మ తల్లి. ఆమె చుట్టూ ప్రకృతివనం ఒకటి ఏర్పాటు చేయండని అభ్యర్థించాడు. వెంటనే స్పందించిన చంద్రబాబు పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. నువ్వు ఏం చేస్తావని అతడిని అడిగినప్పుడు నేను ఆటో నడుపుతాను అని బదులిచ్చాడు. అయితే నీకు ఎలక్ట్రికల్ ఆటో తీసి ఇస్తా నడుపుకుంటావా అని చంద్రబాబు అనగా అందుకు ఆ యువకుడు ఈ రోడ్లలో ఎలక్ట్రికల్ ఆటో పనికిరాదు సార్ అంటూ సున్నితంగా తిరస్కరించాడు. సామాజిక స్పృహ ఉన్న ఇటువంటి యువకుడు సమాజానికి అవసరమంటూ చంద్రబాబు అభినందించారు. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకు అవకాశాలను గుర్తించి బండారు సత్యానందరావు ద్వారా తనకు నివేదిక పంపాలని, వాటిని మంజూరు చేస్తామని చెప్పారు. గంగ్రోతు సతీష్ అనే యువకుడు మాట్లాడుతూ గౌతమీ గోదావరి నది మధ్యలో కృష్ణ జింకల సంరక్షణకు చర్యలు తీసుకోవడంతోపాటు టీడీపీని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఆకుల రామకృష్ణకు పార్టీ నామినేటెడ్ పదవి ఇవ్వాలని చంద్రబాబును అభ్యర్థించారు. వానపల్లి గ్రామానికి చెందిన కంచుస్తంభం లక్ష్మణరావు మాట్లాడుతూ మీతోనే రాష్ట్ర భవిష్యత్ అంటూ చెప్పడంతో సీఎం చంద్రబాబు అతడిని భుజం తట్టారు. అనంతరం చింతపల్లి కిరణ్, ఇళ్ల సత్తిబాబులకు ఎలక్ట్రికల్ బైక్‌లు, చల్లపల్లికి చెందిన పోలిశెట్టి వీరవెంకట సత్యనారాయణకు ఒక ఇల్లు, రూ.లక్ష ఆర్థిక సాయం చేయమని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ను ఆదేశించారు.



విద్యార్థులు తయారుచేసిన నమూనా ప్రాజెక్టులతో శివప్రసాద్, అధికారులు

అంతరిక్ష పరిశోధనలతో మరింత పురోగతి

ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్

వన్నెచింతలపూడిలో జిల్లా స్థాయి జాతీయ అంతరిక్ష దినోత్సవం

అమలాపురం టౌన్, ఆగస్టు 23: అంతరిక్ష పరిశోధనలతో శాస్త్ర సాంకేతిక రంగాలు మరింత పురోగతిని సాధిస్తాయని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త యాళ్ల శివప్రసాద్ అన్నారు. అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశం జీరోస్థాయి నుంచి ఈరోజున హీరో స్థాయికి ఎదిగిందన్నారు. పరిశోధనలతోనే ఆధునిక ప్రపంచం మరింత పురోభివృద్ధిని సాధిస్తుందన్నారు. ప్రపంచంలోనే ఎన్నో దేశాలు నేడు అంతరిక్ష పరిశోధనలకోసం భారతదేశం వైపు చూస్తున్నాయన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు వన్నెచింతలపూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని జిల్లా స్థాయిలో నిర్వహించారు. ఈ వేడుకలకు విశ్రాంత శాస్త్రవేత్త శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, భారతదేశం సాధించిన విజయాలు, భవిష్యత్తులో చేపట్టనున్న ఇస్రో ప్రయోగాలను వివరించారు. అంతరిక్ష పరిశోధనలో తాను కూడా భాగస్వామిని కావడం అదృష్టమన్నారు. నేటి విద్యార్థులే భవిష్యత్తులో అంతరిక్ష పరిశోధనా రంగంలో శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా నిలిచిందని, దానికి గుర్తుగా కేంద్ర ప్రభుత్వం తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుచేసిన పీఎస్ఎల్వీ రాకెట్ (చంద్రయాన్-3) నమూనాతోపాటు పరిశోధనా ప్రదర్శనలను సమగ్ర శిక్ష ఉన్నతాధికారులతో కలిసి శివప్రసాద్ వీక్షించి అభినందించారు. సమగ్ర శిక్ష సీఎంవో బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంవో పి.రాంబాబు, ఏఎల్ఎస్ఈ డి.రమేష్‌బాబు, ఏపీవో ఎంఏకే భీమారావు, ఐఆర్టీ జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, డీఎస్వో జి.సుబ్రహ్మణ్యం, హెచ్ఎం జి.నాగసత్యనారాయణ, టీవీవీ సుబ్రహ్మణ్యం, పి.శ్రీప్రకాష్, ఎస్.విజయలక్ష్మి, శ్రీలక్ష్మి, కె.గణేశ్వరరావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇస్రో ఆన్‌లైన్ క్విజ్ పోటీలు..

ఇస్రో ఆన్‌లైన్‌లో విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై క్విజ్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు నెల్లి సాయిలిమి, పరమట రోహిణి విజేతలుగా నిలిచారు. వీరికి ఇస్రో నుంచి ఆన్‌లైన్‌లోనే ప్రశంసాపత్రాలను అందజేశారు. పీఎస్ఎల్వీ-3 మోడల్ తయారుచేసిన తొమ్మిదో తరగతి విద్యార్థులు కె.సురేష్, బి.ఆదర్శ్ వర్కింగ్ మోడల్‌లో ప్రజ్ఞా రోవర్‌ను తయారుచేసిన పదో తరగతి విద్యార్థులు వి.సతీష్‌తేజ, పి.ప్రవీణ్‌లను హెచ్ఎం నాగసత్యనారాయణతోపాటు జిల్లా అధికారులు అభినందనలు తెలియజేశారు.





వివేకానంద వారధి లంక వైపు ఫిల్లర్ వద్ద కోతకు గురవుతున్న భూమి.. (పక్కన) వివేకానంద వారధి

వారధికి పొంచి ఉన్న ప్రమాదం

వివేకానంద వారధి లంక వైపు ఫిల్లర్ వద్ద కోతకు గురవుతున్న భూమి.. రక్షణ చర్యలు చేపట్టకపోతే వారధి దెబ్బతినే ప్రమాదం

ముమ్మిడివరం, ఆగస్టు 23: గౌతమి గోదావరి నదీపాయపై రామకృష్ణ మిషన్ వారు నిర్మించిన వివేకానంద వారధికి ముప్పు పొంచి ఉంది. వరద నీటి ప్రవాహ ఉధృతికి వివేకానంద వారధి లంకఫ్ రాణేలంక వైపు భూమి కోతకు గురవుతోంది. దీంతో ఆ వారధికి ముంపు పొంచి ఉంది. 1996లో సంభవించిన పెను తుఫాను తాకిడికి ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లోని లంకగ్రామాలు అతలాకుతలమయ్యాయి. ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లింది. ఆ సమయంలో సేవలందించేందుకు ఈ ప్రాంతానికి వచ్చిన రామకృష్ణ మిషన్‌వారు లంకవాసులకు రోడ్డు రవాణా మార్గాన్ని కల్పించేందుకు 1998-99లో రూ.3.25 కోట్లతో వారధిని నిర్మింపజేశారు. దీంతో ముమ్మిడివరం మండలంలోని లంకఫ్‌రానేలంక, పూనాలంక, గురుజాపులంక, అయినవిల్లి మండలంలోని కొండుకుదురులంక, పొట్టిలంక, యల్లకల్లంక, గుణ్ణంమెరక గ్రామాల్లో సుమారు 8 వేల మంది ప్రజలకు రాకపోకలకు రోడ్డు మార్గం ఏర్పడింది. అయితే ఆ తరువాత గోదావరికి వచ్చిన వరదలకు లంకఫ్‌రాణేలంక వైపు భూమి కోతకు గురవుతూ వస్తోంది. దీంతో ఆ వారధి మనుగడకు ముప్పు నెలకొంది. గతంలో కోతకు గురవుతున్న ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టేందుకు ఆయిల్ ఇండియా కంపెనీ రూ.1.20 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించినా అవి కార్యరూపం దాల్చలేదు. గతేడాది ఆగస్టు నెలలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన నాటి సీఎం జగన్మోహనరెడ్డి లంకగ్రామాల నదీకోత నివారణకు రక్షణ చర్యలకు మూడు కిలోమీటర్ల మేరకు రూ.150 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఆ ప్యాకేజీలో వివేకానంద వారధి వద్ద 300 మీటర్ల మేర రివిట్‌మెంట్ పనులకు ప్రతిపాదనలు రూపొందించినా అవి కూడా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం వారధి వద్ద లంక వైపు భూమి 20 మీటర్ల వెడల్పున, 50 మీటర్ల పొడవునా కోతకు గురైంది. ఇక్కడ భూమి మరికొంత మేర కోతకు గురైతే వారధి మనుగడకే ప్రమాదం తక్షణం రక్షణ చర్యలు చేపట్టాలని లంకగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వారధికి ముప్పు పొంచి ఉంది



వరద వచ్చినప్పుడల్లా గోదావరి తీరాన కొంత లంకభూమి కోతకు గురవుతోంది. రక్షణ చర్యలు చేపట్టకపోతే వారధి దెబ్బతినే ప్రమాదం ఉంది. ముమ్మిడివరం, అయినవిల్లి మండలాల్లో సుమారు 8 వేల మంది రాకపోకలకు ఇది ఎంతో అవసరం. ప్రభుత్వం వెంటనే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలి.

- గోదాశి నాగేశ్వరావు, మాజీ సర్పంచ్ లంకాఫ్‌రానేలంక

రక్షణ చర్యలు చేపట్టాలి



వివేకానంద వారధి నిర్మాణం వల్లే లంక గ్రామాలకు రోడ్డు రవాణా మార్గం ఏర్పడింది. లంకవాసులు ఇక్కడ నుంచి బయటకు వెళ్లాలన్నా, రావాలన్నా ఈ వారధి ఎంతో అవసరం. వారధి నిర్మాణానికి ముందు పడవ మీదే ఆధారపడి రాకపోకలు సాగించేవాళ్లం. వారధి ఉండడం వల్ల వరదల సమయంలోనూ అంత ఇబ్బంది ఉండడంలేదు. లంక భూముల్లో ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించేందుకు, పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తీసుకువచ్చేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది.

- అబ్బిరెడ్డి సుబ్బారాయుడు, కూనాలంక, రైతు



గాజుల గౌరీదేవిగా అలంకారం

అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మతల్లిని శుక్రవారం గాజుల గౌరీదేవిగా విశేష అలంకారం చేయగా వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వందలాది మంది మహిళలు సామూహిక వరలక్ష్మీ పూజల్లో పాల్గొన్నారు. నాయకులు మెట్ల రమణబాబు, బొర్రా ఈశ్వరరావు, దున్నాల దుర్గ, అల్లాడ స్వామినాయుడు, భాస్కర్ల రామకృష్ణ, తిక్కిరెడ్డి నేతాజీ పాల్గొన్నారు. - అమలాపురం టౌన్



ఆంధ్రకేసరికి నివాళి

రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగింది. ప్రకాశం చిత్రపటానికి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ టి.నిషాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. - అమలాపురం టౌన్





కోనసీమలో సీఎంకు
ఘన స్వాగతం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం పర్యటించారు. కొత్తపేట మండలం వానపల్లిలో నిర్వహించిన స్వర్ణ గ్రామ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను అయినవిల్లిలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ వద్ద కలిశారు. సీఎంకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.







సత్యనారాయణ స్వామి వ్రతమాచరిస్తున్న నవ దంపతులు

నూతన దంపతులతో సందడిగా
సత్యదేవుని సన్నిధి

అన్నవరం, ఆగస్టు 23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధి శుక్రవారం నూతన దంపతులతో కిక్కిరిసింది. గురువారం రాత్రి రత్నగిరిపై ఒక్కటైన జంటలతో పాటు వివిధ ప్రాంతాల్లో వివాహం చేసుకున్న నూతన దంపతులు సత్యదేవుని వ్రతమాచరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నూతన దంపతులను అంతరాలయంలో స్వామివారి దర్శనానికి ఉచితంగా అనుమతించారు. శుక్రవారం 3వేల వ్రతాలు జరగ్గా సుమారు 500 కొత్త జంటలు వ్రతమాచరించాయి. వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.30లక్షల ఆదాయం వచ్చింది.



గంజాయితో దొరికన బిహార్‌వాసులను చూపిస్తున్న పోలీసులు

కిలో గంజాయి పొట్లాలతో
ఇద్దరు బిహారీల అరెస్టు

కాకినాడ క్రైం, ఆగస్టు 23: కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీచ్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోర్టు సీఐ పి.సునీల్‌కుమార్ తెలిపారు. బిహార్ రాష్ట్రానికి చెందిన రవీందర్ యాదవ్, రాజేష్ రాగూర్ శుక్రవారం మధ్యాహ్నం సమయంలో బీచ్ రోడ్డులోని సాత్విక్ గొడౌన్స్ ఎదురుగా గంజాయిని చిన్న పొట్లాలుగా కట్టి అధిక డబ్బుల కోసం గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న సుమారు కిలో గంజాయి పొట్లాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

భారీగా గంజాయి పట్టివేత?

గోకవరం, ఆగస్టు 23: రంపచోడవరం నుంచి గోకవరం వైపు బొలెరో వాహనంలో తరలిస్తున్న గంజాయిని గోకవరం మండల పరిధిలోని రామన్నపాలెం సమీపంలో పోలీసులు పట్టుకున్నట్టు తెలియవచ్చింది. భారీ స్థాయిలోనే గంజాయి దొరికిందని, తరలిస్తున్న వ్యక్తులు పరారైనట్టు విశ్వసనీయ సమాచారం. గంజాయితో పట్టుబడిన వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్టు స్థానికులు చెప్తున్నారు.



గంజాయి తరలిస్తున్న వాహనం, గంజాయి సంచులు →



ఆ యువతి ఏమైందో!

యానాం, ఆగస్టు 23: యానాం ఫెర్రీ రోడ్డులోని జీసస్ విగ్రహం సమీపంలోని రాజీవ్ బీచ్ వద్ద గుర్తు తెలియని యువతి శుక్రవారం గౌతమి గోదావరిలోకి నడుచుకుంటూ వెళ్లిపోయింది. ఆ సమయంలో అక్కడే ఉన్న వ్యక్తి ఆమెను కాపాడేందుకు చేసిన ప్రయత్నం ఫలించలేదు. గోదావరిలో గల్లంతైంది. ఆమె కుడి కాలు చెప్పు మాత్రమే లభ్యమైంది. 18-20ఏళ్ల మధ్య వయసున్న ఆమె తెల్ల రంగు చున్నీ ధరించినట్టు స్థానికులు తెలిపారు. పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించి గాలింపు చర్యలు చేపట్టారు.



బీచ్ సమీపంలో దొరికిన యువతి కుడి కాలి చెప్పు




సతీష్‌ను గుర్తు చేసుకుని విలపిస్తున్న కుటుంబ సభ్యులు, మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందిస్తున్న పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

తల్లడిల్లిన హృదయం

చేతికందివచ్చిన కొడుకు మృతితో కన్నీరుమున్నీరైన సతీష్ మాతృమూర్తి

మామిడికుదురు, ఆగస్టు 23: చేతికి అందివచ్చిన కొడుకు ఆసరాగా నిలుస్తాడనుకున్న ఆ తల్లి ఆశ అడియాస అయ్యింది. అచుత్యాపురంలోని ఫార్మా సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమంలో జరిగిన విస్ఫోటనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం పాశర్లపూడిలంకకు చెందిన మారిశెట్టి సతీష్ (33) మరణించిన సంగతి తెలిసిందే. అతడి మృతదేహం శుక్రవారం తెల్లవారుజామున స్వగ్రామానికి చేరుకుంది. మృతదేహాన్ని చూసి సతీష్ తల్లి పద్మావతి, భార్య వెంకట నాగమణి విలపించిన తీరు చూపరులను కలచివేసింది. సతీష్ తండ్రి కొబ్బరి బొదిలీలు తయారు చేసి విక్రయిస్తుంటాడు. తల్లి గృహిణి కాగా సోదరుడు రమేష్ తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడైన సతీష్ ఉద్యోగంలో స్థిరపడి కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న సమయంలో మృత్యువు కాటేసిందంటూ ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. 25 రోజుల క్రితం ఇంటికి వచ్చిన సతీష్ ఇలా విగతజీవిగా రావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సతీష్ అంత్యక్రియలను శుక్రవారం తెల్లవారుజామున గ్రామంలో నిర్వహించారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.కోటి చెక్కును సతీష్ కుటుంబానికి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, జనసేన నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొరుసు సత్తిబాబు వున్నారు.



మారిశెట్టి సతీష్ (పాత చిత్రం)

మృతుల కుటుంబాలకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా అందజేత



గణేష్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కొప్పర్తి గణేష్‌కుమార్ మృతదేహాన్ని శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటలకు తీసుకువచ్చారు. విషయం తెలిసిన వెంటనే అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గణేష్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.కోటి చెక్కు అందించి అన్ని విధాలా ఆదుకుంటుంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామారెడ్డి, నేతలు పాలచర్ల శివ ప్రసాద్‌చౌదరి, సింగారపు రామారావు, వెంకటేష్, మధు, ఆర్డీవో కె.శివజ్యోతి, తహసీల్దారు డబ్ల్యు లక్ష్మీరమణి తదితరులు పాల్గొన్నారు.



నాగబాబు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి

సామర్లకోట, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మా సెజ్ విస్ఫోటనంలో మృతి చెందిన అసిస్టెంట్ మేనేజరు నాగబాబు కుటుంబాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. నాగబాబును తీసుకురావడం ఎవరితరం కాదని, అతడి కుటుంబానికి భరోసా ఇస్తామని చెప్పి ఓదార్చారు. కాగా ప్రభుత్వం ప్రకటించిన ఎక్స్‌గ్రేషియా రూ.కోటిని చెక్కు రూపంలో సామర్లకోట తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి నాగబాబు కుటుంబీకులకు టీడీపీ, జనసేన నాయకుల సమక్షంలో అందజేశారు.



హారిక తల్లి అన్నపూర్ణకు చెక్కు అందజేస్తున్న తహసీల్దారు జితేంద్ర

సర్పవరం జంక్షన్, ఆగస్టు 23: అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలుడు దుర్ఘటనలో మృతి చెందిన ట్రైనీ ఇంజనీరు చల్లపల్లి హారిక తల్లి అన్నపూర్ణకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెక్కును అర్బన్ తహసీల్దారు జితేంద్ర అందజేశారు. ఆ సమయంలో అన్నపూర్ణ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఒక్కగానొక్క కుమార్తె జీవించి లేనప్పుడు తాను ఎవరి కోసం బతకాలని, ఈ డబ్బులు ఏం చేసుకోవాలని బోరున విలపించింది. దీంతో ఆమెను అధికారులు సముదాయించారు.





రెండో రోజు అంతర్జాతీయ సెమినార్‌లో మాట్లాడుతున్న రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, 60 పరిశోధనా రచనలు చేసిన డాక్టర్ శ్రీనివాసరావును సత్కరిస్తున్న ప్రముఖులు

సైన్స్‌తోనే మానవాళి మనుగడ

విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలి

అంతర్జాతీయ సెమినార్ ముగింపు సభలో వక్తలు

మండపేట, ఆగస్టు 23: సైన్స్‌తోనే మానవ జీవితం ముడిపడి ఉందని దక్షిణ కొరియా శాస్త్రవేత్త కె.నవీన్‌కుమార్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే సైన్స్‌పట్ల అవగాహన పెంచుకుని నూతన పరిశోధనలు చేయాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజులు జరిగిన అంతర్జాతీయ సెమినార్ ముగింపు సభ శుక్రవారం జరిగింది. నవీన్‌కుమార్ తో పాటు మరో శాస్త్రవేత్త ఎ.భార్గవ్ తాము చేసిన ఫ్లోరోసిక్ పౌడర్, ఎల్ఈడీలు అనే పరిశోధనలపై ప్రసంగించారు. ఆర్ఎంటీ యూనివర్సిటీ (నాగపూర్) ప్రొఫెసర్ సంజీవ్‌డోగేల్ నానో మెటీరియల్స్, నానో ఇంజన్ల గురించి విద్యార్థులకు వివరించారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా మానవాళికి అవసరమైన టెక్నాలజీతో పాటు అనేక పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వక్తలు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సెమినార్‌ను విజయవంతం చేసిన ఘనత అధ్యాపకుడు కె.శ్రీనివాస్‌కు దక్కుతుందన్నారు. సదస్సు నిర్వహణకు సహకరించిన దాతలకు ప్రిన్సిపాల్ కేటీటీవీ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ కె.శ్రీనివాస్ పరిశోధించిన 60 రిపోర్టులను పుస్తకంగా తయారు చేసి ఆవిష్కరించారు. నేటి యువతకు, విద్యార్థులకు ఆయన రాసిన పరిశోధనా వ్యాసాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు వక్తలు అన్నారు. నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర, సాంకేతికతలను అలవాటు చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సెమినార్ విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన శ్రీనివాస్, కిరణ్‌కుమార్, ఇతర అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు. సెమినార్‌ను విజయవంతంగా నిర్వహించిన కె.శ్రీనివాస్‌ను ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సత్కరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరావు, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మితో పాటు విదేశాలు, పలు రాష్ట్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలను సత్కరించి మెమెంటోలు అందజేశారు.



2.800 గ్రాముల బరువుతో చిన్నారి

నాడు బక్కగా... నేడు బొద్దుగా

చింతూరు సీహెచ్‌సీలో శిశువుకు అరుదైన వైద్యం

80 రోజుల తర్వాత కోలుకున్న వైనం

చింతూరు, ఆగస్టు 23: ఏజెన్సీలో అప్పుడే పుట్టిన బిడ్డ ప్రాణపాయ స్థితిలో ఉండడంతో 80 రోజులు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి తల్లి కళ్లల్లో ఆనందం నింపారు. వీఆర్ పురం మండలం దారపల్లి గ్రామానికి చెందిన అందేలా సుభద్ర ఏడవ నెలలోనే పురిటి నొప్పులు వస్తున్నాయని జూన్ 3న చింతూరు కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు వచ్చింది. ఆమె మగ శిశువుకు జన్మనివ్వగా బరువు సుమారు 0.936 గ్రాములు మాత్రమే ఉంది. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి, ఎస్ఎన్‌సీయూ సిబ్బంది శిశువు ప్రాణపాయ స్థితిని గుర్తించారు. నెలలు పూర్తిగా నిండకపోవడంతో తల్లి గర్భంలో అవయవాల ఎదుగుదల పూర్తిగా లేదని తెలిపారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం లేదా ఖమ్మం తరలించాల్సి వస్తుందని తల్లిదండ్రులకు చెప్పారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వాళ్లు వెళ్లడానికి నిరాకరించారు. దీంతో చింతూరులోనే వైద్యం చేసేందుకు నిర్ణయించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి నిరంతర పర్యవేక్షణలో చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ హర్ష, ఎస్ఎన్‌సీయూ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమర్ అత్యవసర చికిత్స మందులను వినియోగించి సుమారు 80 రోజులు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించారు. దీంతో శిశువు బరువు 2.800 కేజీలకు పెరిగింది. శుక్రవారం వైద్యుల పర్యవేక్షణలో శిశువును తల్లికి అప్పజెప్పి డిశ్చార్జి చేశారు. కాగా ఎస్ఎన్‌సీయూ ద్వారా అందుతున్న సేవలను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పుల్లయ్య పరిశీలించి సూపరింటెండెంట్‌ను, వైద్యాధికారులను, ఎస్ఎన్‌సీయూ సిబ్బందిని అభినందించారు. సీహెచ్‌సీలో ఈ సంవత్సరంలో బరువు తక్కువగా ఉన్న 65 మంది పిల్లలకు సేవలందించామని సూపరింటెండెంట్ తెలిపారు. కార్యక్రమంలో పిడియాట్రిషన్ డాక్టర్ హర్ష, డాక్టర్ ఉమర్, ఎస్ఎన్‌సీయూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వగ్రామానికి బయల్దేరి... విగతజీవిగా మారి

కుమారుడి ఆరోగ్యం బాగోలేదని మనస్థాపంతో కార్మికుడి ఆత్మహత్య

ప్రత్తిపాడు, ఆగస్టు 23: కుమారుడి ఆరోగ్యం బాగోలేదని మనస్థాపంతో తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కార్మికుడి సహచరులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని లంపకలోవ వీరభద్ర ఎక్స్‌పోర్ట్స్ కంపెనీలో ఒడిసా రాష్ట్రం నరాల జిల్లా కలకంటికి చెందిన పప్పు మంగరాజు (21) కార్మికుడిగా పని చేస్తున్నాడు. స్వగ్రామంలో భార్య, పిల్లలను విడిచిపెట్టి కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. కుమారుడి ఆరోగ్యం బాగోలేదని రెండు రోజుల క్రితం భార్య ఫోను చేసి చెప్పింది. దీంతో మంగరాజు స్వగ్రామం వెళ్లేందుకు గురువారం సామర్లకోట రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. అయితే వెనక్కు మళ్లి తాను చేస్తున్న కంపెనీ వద్దకు వచ్చేశాడు. శుక్రవారం అక్కడికి సమీపంలోని తోటలో మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సహచరులు గుర్తించి ఒడిసాకు చెందిన సూపర్‌వైజరు ఫాల్గుణకు సమాచారం తెలపడంతో అయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్, పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఉరి వేసుకున్న కార్మికుడిని పరిశీలిస్తున్న పోలీసులు

- కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్
- జిల్లాలో ఉపాధి గ్రామసభల నిర్వహణ
- అభివృద్ధి పనులపై వినతిపత్రాలు అందజేత

రహదారులు ఛిద్రం

రావులపాలెం, ఆగస్టు 23: రావులపాలెం మండలంలో ఎడతెరిపిలేని వర్షం కురిసిన నేపథ్యంలో ఛిద్రమైన రహదారి గోతుల్లోకి వర్షం నీరు చేరింది. మండల పరిధిలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో పలు పల్లపు ప్రాంతాలు బురదమయంగా మారాయి. ఆధునీకరణకు నోచుకోని ముమ్మడివర్రాడు, దేవరపల్లి తదితర గ్రామాల ప్రధాన రహదారులలోని గోతుల్లోకి సైతం వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు, రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు.

ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు




యానాం: రూ.16లక్షల కరెన్సీ నోట్లతో కన్యకాపరమేశ్వరి, ఆత్రేయపురం రూపాయి నాణెలతో లక్ష్మీదేవి.

అంతర్వేది, ఆగస్టు 23: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీరాజ్యలక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను శుక్రవారం నిర్వహించారు. దాతల సహకారంతో భక్తులకు పూజా సామగ్రి అందించారు. భక్తులకు ఉచితంగా పూజా సామగ్రి, రూపు, అమ్మవారి ఫొటోను అందించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అంబాజీపేట: మండలంలోని పలు ఆలయాలు శ్రావణ శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ఇళ్ల వద్ద పూజ మండపాలను ప్రత్యేకంగా అలంకరించుకుని పూజలు నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవార్ని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. పుల్లేటికుర్రు మార్కెట్‌పాలెంలోని ఆలయంలో హిందూ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో సామూహికవరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

కె.గంగవరం: పామర్రు ఉమాపార్వతి మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు యనమండ్ర సాంబశివ ఆధ్వర్యంలో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతాలు ఆచరించారు. వ్రతాల్లో పాల్గొన్న 80మంది మహిళలకు కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు చుండ్రు వీవీఎస్ఎస్ చౌదరి లక్ష్మీదేవి వెండి రూపు లను అందించారు. పామర్రు, అముజూరు, యండగండి తదితర గ్రామాల నుంచి వచ్చిన మహిళలు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలో వేంచేసియున్న పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఖజానా జ్యూయలర్స్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో మహిళలకు పూజా సామగ్రి, చీర, రవిక అందజేశారు. అర్చకులు నిట్టల జోగారావు, భక్తులు పాల్గొన్నారు.

యానాం: యానాం ఆత్రేయ గోదావరి చెంతన కొలువైఉన్న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆమ్మవారు ధనలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం వంకయాల కుటుంబ సభ్యులు, మాజేటీ బద్రర్స్, మతంశెట్టి రమేష్, గ్రంధి సుధాకర్, యానాం ఆర్యవైశ్య సంఘం సభ్యులురూ.16.22లక్షల కరెన్సీ నోట్లతో అమ్మవారిని ధనలక్ష్మీ దేవిగా అలంకరించారు.భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీసాయి లలిత భక్తమండలి భక్త బృందం లలితా సహస్రనామం, విష్ణు సహస్ర నామం ఆలపించారు.

ఆత్రేయపురం: స్థానిక శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడో శుక్రవారం శ్రీలక్ష్మీదేవి అమ్మవార్ని రూపాయి నాణెలతో విశేష అలంకరణ నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ని దర్శించుకున్నారు. వాడవాడలా శ్రావణ శుక్రవారం పూజలు మహిళలు నిర్వహించుకున్నారు.

అల్లవరం: మొగళ్లమూరు రామాలయంలో విశ్వహిందు పరిషత్, దర్మరక్షక్ గుడాల పుల్లయ్యశెట్టి ఆధ్వర్యంలో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఇళ్లల్లో మహిళలు వరలక్ష్మీ వ్రత పూజలు చేశారు. దుర్గాలయాలు, రామాలయాలు, వెంకటేశ్వరస్వామి ఆలయాలు మహిళలతో కిటకిటలాడాయి. బీజేపీ మండల కార్యదర్శి కట్టా నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఆలమూరు: చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతాలు సామూహికంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సామూహిక వరలక్ష్మివ్రతాలకు విశేషస్పందన లభించింది. దేవాలయం పూజా సామగ్రిని సమకూర్చడంతో చింతలూరు, వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వరలక్ష్మి వ్రతాలను ఆచరించారు. వేదపండితులు మహిళలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలను జరిపించారు.

అమలాపురంటౌన్: అమలాపురం గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మతల్లిని శుక్రవారం గాజుల గౌరీదేవిగా విశేష అలంకారం చేయగా వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వందలాది మంది మహిళలు సామూహిక వరలక్ష్మీ పూజల్లో పాల్గొన్నారు. నాయకులు మెట్ల రమణబాబు, బొర్రా ఈశ్వరరావు, దున్నాల దుర్గ, అల్లాడ స్వామినాయుడు, భాస్కర్ల రామకృష్ణ, తిక్కిరెడ్డి నేతాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వ ధ్యేయం






ద్రాక్షారామ: గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, మండపేట: ఏడిద సభలో మాట్లాడుతున్న వేగుళ్ల జోగేశ్వరరావు, అంబాజీపేట: పుల్లేటికుర్రులో సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి, అమలాపురం:నల్లమిల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

ద్రాక్షారామ, ఆగస్టు 23: అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం ధ్యేయమని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం ద్రాక్షారామ గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధ్యక్షతన జరిగిన ఉపాధి హామీ పథకం గ్రామసభలో మంత్రి మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ అనుబంధ పనులు, నీటి సంరక్షణ పనులు, మౌలిక సదుపాయాల కల్పన వంటి పనులు చేపట్టవచ్చన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా రూపుదిద్దుకుంటుందన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ ఆలోచనలతో ఎన్డీఏ కూటమి ద్వారా రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు పెంకే సాంబశివరావు, పితాని వీరభద్రరావు, ఉపసర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, ఏపీవో ఈశ్వరరావు, కార్యదర్శి వి.సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు, జనసేన నాయకులు ఫాజల్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: అభివృద్ధిపనులు గుర్తించడానికి గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించడంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. ఉడిమూడి పంచాయతీ వద్ద సర్పంచ్ ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఉడిమూడిలో డ్రైనేజీ వ్యవస్థ, శ్మశానవాటిక సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. పి.గన్నవరంతో పాటు మిగిలిన 18గ్రామపంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. శివారు ప్రాంతాలకు రహదారులు ఏర్పాటుచేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరారు. ఆయాకార్యక్రమాల్లో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో ఎం.భారతీ, కార్యదర్శులు కుమార్, లక్ష్మీనారాయణ, గ్రామసర్పంచ్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కె.గంగవరం: గ్రామ సభల ద్వారా గ్రామాల్లోని సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీడీవో ఎస్.శ్రీనివాసు అన్నారు. శుక్రవారం మండలంలోని 26 గ్రామపంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. పామర్రులో నిర్వహించిన సభలో ఎంపీడీవో హాజరయ్యారు. 26గ్రామాల్లోను ఎస్‌ఆర్‌ఈ జీఎస్ ద్వారా చేపట్టే పనులు గుర్తించారు. అముజూరులో నిర్వహించిన సభలో టీడీపీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ పాల్గొన్నారు. గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం, సీసీడ్రైన్ల నిర్మాణం, ఇంటింటికి తాగునీరు వంటి అంశాలను కూటమి నాయకులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సభలకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు అధ్యక్షత వహించారు. గ్రామ కార్యదర్శులు, ఎస్‌ఆర్‌ఈసీఎస్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాయవరం: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని రాయవరం టీడీపీ సీనియర్ నాయుడు ఉండవల్లి రాంబాబు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వ హించారు. సభల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు గుర్తించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు,తాగునీరు, సీసీరోడ్లు, సీసీ డ్రైన్లు వంటి సమస్యలు ప్రజలు గ్రామసభదృష్టికి తీసుకు వచ్చారు. కూటమి నాయకులు, పంచాయతీ పాలకవర్గాలు, సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్వేది: అప్పనరామునిలంక గ్రామంలో జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా చేయాలనేది కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. సఖినేటిపల్లి, లంక, అంతర్వేది, మోరి, మోరిపోడు, టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం, గొంది తదితర గ్రామాల్లో గ్రామసభలు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో జరిగాయి. జనసేన పార్టీ మండలాధ్యక్షుడు గుబ్బల ఫణికుమార్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీడీవో సత్యనారాయణ, ప్రత్యేకాధికారి హర్షవర్ధన్, ఏపీవో నాగప్రసాద్, ఏపీఎం కె.విజయ్, మాజీ సర్పంచ్ బర్రె శ్రీను, గ్రామ కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో సర్పంచ్‌ల అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభలు జరిగాయి. కత్తిమండలో జరిగిన గ్రామ సభకు ఎంపీపీ ఎంవీ సత్యవాణి అధ్యక్షత వహించారు. ప్రతీగ్రామంలోరోడ్లు, డ్రైన్లు, అభివృద్ధి పనుల కోసం ప్రజలు వినతిపత్రాలు అందించారు.

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో శుక్రవారం సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులపై చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చేలా నిర్ణయించారు. తొత్తరమూడిలో జరిగిన గ్రామసభలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడారు. గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైసీపీ పాలనలో పంచాయతీరాజ్‌వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు

అల్లవరం: మండలంలోని 21గ్రామపంచాయతీల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. బెండమూర్లంకలో సర్పంచ్ బర్రే సీతారత్నం అధ్యక్షతన జరిగిన గ్రామసభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. గోడిలోసర్పంచ్ తోట శ్రీదేవి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు పాల్గొన్నారు. గోడిలంక, బోడసకుర్రు, దేవగుప్తం, గూడాల, గోడితిప్ప, రెల్లుగడ్డ తదితర గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, తహశీల్దారు వీవీఎల్ నరసింహం, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు, రుద్రరాజు పవిత్ర, ముత్యాల రామకృష్ణ, దాకారపు చిరంజీవి, ఎన్.సుబ్బరాజు, ఎన్.వాసురాజు, చిట్నీడి శ్రీదేవి, రొక్కాల విజయలక్ష్మి, ఏవో ఎస్వీవీ సత్యనారాయణ, ఏఈలు సంపత్, స్వామి, అధికారులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: ఐదేళ్ల జగన్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నాశనమైందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆరోపించారు. మురమళ్లలో జరిగిన గ్రామసభలో వారు పాల్గొన్నారు. పంచాయతీల బలోపేతానికి గ్రామసభలు ఏర్పాటు జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాలే రాజబాబు, గుత్తుల సాయి, జంపన బాబు, చెయ్యేటి శ్రీనుబాబు, ఏలూరి మూర్తి, కటూరి నాని, సవరపు రమణ, తోరం లక్ష్మణ్, గంజా సుధాకర్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: 17పంచాయతీల్లో శుక్రవారం జరిగిన ఉపాధి గ్రామసభల్లో పార్టీలకతీతంగా ప్రజలు పాల్గొని తమ గ్రామాల్లో అవసరమైన పనులకు దరఖాస్తులు చేసుకున్నారు. అన్ని పంచాయతీల నుంచి కలిపి మొత్తం 1,533పనులు గుర్తించినట్టు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో కె.రాజామణి తెలిపారు. వీటిలో 39అంగన్వాడీ భవనాలు, ఒక పంచాయతీ భవనం, ఒక డిజిటల్ లైబ్రరీ భవనం, 190సీసీ రోడ్లు, ఒక బీటీ రోడ్డు, 15కల్వర్టులు, 6పశువులశాలలు, 22సీసీ డ్రెయిన్లు, 20ప్రహరీ గోడలు, ఒక లెవెలింగ్ పని, అన్ని గ్రామాల్లోనూ దహనవాటికల అభివృద్ధి పనులు ఉన్నట్టు వివరించారు. ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి నాయకులుపాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెంమండలంలోని 12గ్రామాల్లో ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ సభలు నిర్వహించి ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే పనులు, తదితర వాటిపై నమోదు చేశారు.

ఆత్రేయపురం: మండలంలోని17గ్రామాల్లోఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఆయా పంచాయతీల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన సభల్లో ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు. ఎంపీడీవో నాతి బుజ్జి గ్రామసభల్లో పాల్గొని పనులకు సంబంధించిన విషయాలను గుర్తించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా చేపట్టే పనుల ప్రతిపాదనలు, ఉపాధి హామీ చట్టంపై అవగాహన కల్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, అధికార పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాజోలు: మండలంలోని పదహారుగ్రామాల్లో శుక్రవారం ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించారు. ఈసభల్లో డ్రెయిన్లు, సీసీ రోడ్డు, ఉపాధిహామీ పనుల ఆమోదం, కొత్త పనుల గుర్తింపుపై గ్రామ సభల్లో చర్చించారు. ఉపాధిహామీ చట్టం హక్కులు, ప్రయోజనాల గురించి తాటిపాక సూపర్‌వైజర్ అధికారి, ఎంపీడీవో ఎస్.బాలాజీ ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ కేతా శ్రీను మాట్లాడుతూ 2014-19మధ్య గ్రామాల అభివృద్ధి స్వర్ణయుగంగా మారాయన్నారు.వైస్ ఎంపీపీలు పొలమూరి శ్యామ్‌బాబు, యింటిపల్లి ఆనందరాజు, సర్పంచ్‌లు కోటిపల్లి రత్నమాల, కాండ్రేగుల సత్యనారాయణ, రేవు జ్యోతి, నక్కా రామావు, గిడుగు బుజ్జి, అడబాల శ్రీనివాస్, చొప్పల గుణనాథ్, ఎంపీటీసీలు శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొడ్డు కృష్ణారావు, ఉండ్రు సూర్యారావు, అధికారులు పాల్గొన్నారు.

మామిడికుదురు: పంచాయతీలకు జవసత్వాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు. మండలంలోని 18గ్రామాల్లో గ్రామ సభలను శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించారు. మగటపల్లిలో జరిగిన గ్రామ సభలో నామన రాంబాబు మాట్లాడారు. పలు గ్రామాల్లో జరిగిన సభల్లో రోడ్లు, డ్రైన్లు ఏర్పాటు చేయాలని పంచాయతీల ద్వారా తీర్మానాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మిడివరం: రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి అంతా కలిసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ కోలా గంగాభవానీ సూచించారు. అనాతవరంలో సర్పంచ్ మిమ్మితి చిరంజీవి అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఎస్‌ఆర్‌ఈజీఎస్ గ్రామసభలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సహకారంతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా పనులు చేపట్టాలని ఆమె సూచించారు. సీహెచ్ గున్నేపల్లిలో సర్పంచ్ గొలకోటి దొరబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్వహణ వంటి పనులు చేపట్టాలని తీర్మానించారు. మండలంలో 16 గ్రామపంచాయతీల్లో ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు తదితర విషయాలపై చర్చించి తీర్మానించారు. జడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, ఎంపీడీవో జె.రాంబాబు, ఏపీవో టి.వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ సీహెచ్ కల్యాణి, వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, కూటమి నాయకులు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండపేట: వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేయడంతో పాటు ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. ఏడిదగ్రామ పంచాతీయ వద్ద శుక్రవారం జరిగిన ఉపాధి హామీ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో ప్రజల ఆమోదంతో అభివృద్ధి పనులు చేపడుతుందన్నారు. వై.సీతానగరం, వెలగతోడు, పాలతోడు, మెర్నిపాడు, ఇప్పనపాడు, తాపేశ్వరం, అర్తమూరు, జెడ్.మేడపాడు. ద్వారపూడి, కేశవరం, మారేడుబాక తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అభివృద్ధి పనులకు సంబంధించి వినతిపత్రాలు స్వీకరించారు. ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలోని 18గ్రామపంచాయతీల వద్ద శుక్రవారం సర్పంచ్‌ల అధ్యక్షత గ్రామసభలు నిర్వహించారు. గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టవలసిన పనులపై చర్చించారు. గ్రామసభల్లో వివిధ అంశాలపై సమీక్షించారు. ఆలమూరు గ్రామసభలో ఎంపీడీవో జాన్‌లింకన్ వివిధ అంశాలను వివరించారు.

అంబాజీపేట: గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రులో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. మాచవరం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో చేపట్టాల్సిన పనుల వివరాలు పంచాయతీ కార్యదర్శి జీజీవీకే కుమార్ చదివి వినిపించారు. మండలంలోని పలు పంచాయతీల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీవీ సరోవర్, ఏపీవో అడపా వెంకటశ్రీకృష్ణ, ప్రత్యేకాధికారులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించారు. కపిలేశ్వరపురంలో సర్పంచ్ సాకా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి ఎ.శాంతి, ఏవో ప్రకాష్, కార్యదర్శి శివచక్రవర్తి పాల్గొన్నారు. అంగరలో గ్రామసర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో తహశీల్దార్ చిన్నారావు, కార్యదర్శి సుభాకర్, టీడీపీ జిల్లా అధికారి పుత్సల శ్రీనివాస్ పాల్గొని గ్రామాల్లో గుర్తించిన పనులను చదివి వినిపించి, అవసరమైన పనులపై తీర్మానాలు చేశారు. కపిలేశ్వరపురం గ్రామసభలో రాష్ట్ర తెలుగు యువత సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొప్పిశెట్టి వాసు మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు, వివిధశాఖల అధికార్లు, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: ఉపాధిహామీ పథకంతో చేపట్టనున్న పనులతో గ్రామాలు మరింత పురోభివృద్ధిని సాధిస్తాయని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఎ.వేమవరప్పాడు, నల్లమిల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆనందరావు మాట్లాడారు. ఉపాధిహామీలో పనిచేసే కూలీలు అత్యధిక దినాలు పనులు పొందడంద్వారా గ్రామాలు ఏవిధంగా అభివృద్ధి చేసుకోవచ్చో వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, సర్పంచ్ గోకరకొండ వాసు పాల్గొన్నారు. అదేవిధంగా ఎంపీడీవో జి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మండలంలోని 22 గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా ఉపాధిహామీ తీర్మానాలను ఆమోదించారు.




ఐ.పోలవరం: మురమళ్ల గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు, అంతర్వేది: గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయించుకోండి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్



అమలాపురం టౌన్, ఆగస్టు 23: పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు శ్రీకారం చుట్టినట్టు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ పేర్కొన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఈనెల29వ తేదీ నుంచి సెప్టెంబరు 3వరకు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ల నమోదు సన్నాహక సమావేశం జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లగా ప్రభుత్వ విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి త్వరలో జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ సంఘాల అభ్యర్థులను గెలిపించుకుని హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 2018 నవంబరు 1 నుంచి 2024 నవంబరు 1 వరకు ఆరేళ్ల మధ్యకాలంలో మూడేళ్ల పాటు ప్రభుత్వ విద్యారంగ సంస్థల్లో పనిచేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటర్లుగా నమోదు చేయించుకునేందుకు అర్హులని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు దొరబాబు మాట్లాడుతూ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు అన్ని పాఠశాలలు, కళాశాలలను సందర్శించి ఓటరు నమోదు పత్రాలను పెంచాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చొప్పుల రాంబాబు, చిక్కం షైనరుబాబు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కొప్పుల సత్తిబాబు, నేరేడుమిల్లి సత్యనారాయణ, నిమ్మన సత్యనారాయణ, వేమన వీవీసత్యనారాయణ, కె.రంజిత్‌కుమార్‌త దితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

రామచంద్రపురం(ద్రాక్షారామ),ఆగస్టు23:రామచంద్రపురంశ్రీసిటీలో నిర్మించనున్న వివేకానంద ఉన్నతపాఠశాల భవన నిర్మాణానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం భూమిపూజచేశారు. విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఈడి శైలూషా, అకడమిక్ డీన్ వికాషా, బి.సరోజినిపాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: డిమోంటీ
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్ర్కీన్-1	: మారుతీనగర్ సుబ్రహ్మణ్యం
శేఖర్ స్ర్కీన్-2	: డబుల్ ఇస్మార్ట్
రమా	: ఆయ్
గణపతి	: రేవు
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: తంగలాన్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: ఏలియన్ రొమ్ములస్

వెంకన్న ఆలయంలో వేగేశ్న ఫౌండేషన్ అధినేత పూజలు

ఆత్రేయపురం, ఆగస్టు 23: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం వేగేశ్న ఫౌండేషన్ అధినేత ఆనందరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. వేగేశ్న ఫౌండేషన్ ద్వారా దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తానన్నారు. ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,66,505 లభించినట్టు ఈవో కిషోర్‌కుమార్ తెలిపారు.

అంతరిక్ష ప్రయోగాలకు వేదిక మన దేశమే



మాట్లాడుతున్న డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ

అమలాపురం టౌన్, ఆగస్టు 23: అంతరిక్ష ప్రయోగాలకు వేదికగా నేడు భారతదేశం నిలిచిందని కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ పేర్కొన్నారు. చంద్రయాన్-3 విజయవంతం కావడంతో ఇకపై ప్రతీ ఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించుకుంటామన్నారు. అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలల్లో సైన్స్ పరిషత్ మహాసభల్లో భాగంగా జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను సర్వేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా మహాసభల్లో ప్రిన్సిపాల్ కవల కోటిలింగం, వైస్ ప్రిన్సిపాల్ కె.శిరీష, ఎం.వెంకటేశ్వరరావు, ఎం.సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి జయంతి

అమలాపురం టౌన్, ఆగస్టు 23: తొలిముఖ్యమంత్రి ఆంధ్రకేసరిటంగుటూరి ప్రకాశంపంతులు జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లోనిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు.

'గురుకులం'లో ప్రవేశాలు

రాజోలు, ఆగస్టు 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల రాజోలు బాలికల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఖాళీల సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి శుక్రవారం తెలిపారు. 5వ తరగతిలో 39 సీట్లు, 6వ తరగతిలో 11 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 5, బైపీసీలో 6 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల27వ తేదీ ఉదయం 10గంటలలోపు పాఠశాల కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆధార్, టీసీ, మార్కుల లిస్టు, సంబంధిత సర్టిఫికెట్లతో పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తామన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు23: మెగా డీఎస్సీపై తొలిసంతకం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను తెలియపరిచారని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం స్థానిక వీఎస్ఎం కళాశాలలో ఏర్పాటుచేసిన ఉచిత టెట్, డీఎస్సీ కోచింగ్ తరగతులను మంత్రి ప్రారంభించారు. అభ్యర్థులకు స్టడీమెటీరియల్ పంపిణీచేశారు. ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, డాక్టర్ కోట సతీష్‌కుమార్, రైసుమిల్లర్ల అసోసియేషన్ నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. ఉచిత శిక్షణకు డాక్టర్ కోట సతీష్‌కుమార్ రూ.50వేలు, కోనసీమ రైసుమిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.2లక్షలువిరాళంగా అందజేశారు.

సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

అయినవిల్లి, ఆగస్టు 23: కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని వానపల్లిలో జరిగిన గ్రామ సభలో సీఎం చంద్రబాబునాయుడు హాజరయ్యారు. అయినవిల్లిలో హెలిప్యాడ్ ఏర్పాటుచేశారు. హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, పి.గన్నవరం, ముమ్మిడివరం, కొత్తపేట ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దాట్ల సుబ్బరాజు, బండారు సత్యానందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ వర్మ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర నాయకులు డొక్కా నాథ్‌బాబు, నామన రాంబాబు, ఎస్పీ బి.కృష్ణారావు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, బీజేపీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అయినవిల్లి నుంచి రోడ్డుమార్గంలో చంద్రబాబు కాన్వాయ్ వానపల్లి బయలుదేరింది. దారి పొడవునా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. చంద్రబాబు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



ఆత్రేయపురం: అయినవిల్లి హెలిపాడ్ దిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు పుష్పగుచ్ఛంతో చంద్రబాబుకు ఘనస్వాగతం పలికారు. మండలంలోని ముఖ్య నాయుకులు చంద్రబాబు సభలో పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి సీఎం చంద్రబాబు భరోసా

ఉప్పలగుప్తం, ఆగస్టు 23: కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ అధిష్ఠానం ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నట్టు మరోసారి రుజువైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, సీనియర్ నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, నిమ్మకాయల చెల్లయ్యనాయుడు వ్యాఖ్యానించారు. శుక్రవారం చల్లపల్లికి చెందిన మూగ వ్యక్తి పోలిశెట్టి సత్తిబాబు భార్య కుమారితో కలిసి వానపల్లిలో సీఎం చంద్రబాబును కలిసి కష్టాలను చెప్పుకున్నారు. సత్తిబాబు పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా పార్టీ కార్యక్రమాల్లో ముందుండేవాడు. వయసు రీత్యా ఇప్పుడు ఇంటికే పరిమితమయ్యాడు. పరిస్థితిని తెలుసుకున్న చంద్రబాబు సత్తిబాబు కుటుంబానికి భరోసా కల్పించారు. రూ.లక్ష సహాయంతో పాటు గృహం నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీ అధినేత చంద్రబాబు కార్యకర్తలవెన్నంటి ఉంటారనేందుకు ఈసంఘటన నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు.

ఆసుపత్రిలో ఫార్మసీ విభాగం తనిఖీ

యానాం, ఆగస్టు 23: యానాం ప్రభుత్వాసుపత్రిలోని శుక్రవారం ఫార్మసీ విభాగాన్ని పరిపాలనాధికారి మునిస్వామి శుక్రవారం తనిఖీచేశారు. రోగులకు మందులు ఇచ్చే ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఆయన మత్స్య శాఖ కార్యాలయానికి వెళ్లి ఐస్‌ప్లాంట్‌ను పరిశీలించారు.

ముస్లిం మహిళల ర్యాలీ

మండపేట, ఆగస్టు 23: దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని, మహిళలపై అత్యాచారాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని ముస్లిం మహిళలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండపేటలో శుక్రవారం ముస్లిం మహిళలు, సీఐటీయూ నాయకురాలు కె.కృష్ణవేణి, కౌన్సిలర్ నీలం దుర్గ, జమాతే మహిళారాష్ట్ర నేత అబుల్‌ఆలాసారధ్యంలో కోల్‌కతాలో జరిగిన పీజీ వైద్య విద్యార్థి ఘటనను నిరసిస్తూ మహిళలు ప్లకార్డులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. గాంధీనగర్ నుంచి ర్యాలీ మెయిన్‌రోడ్డు మీదుగావార్డుల్లో సాగింది.

మాలమహానాడు నాయకుల నిరసన



ఆత్రేయపురం, ఆగస్టు 23: వానపల్లిలో శుక్రవారం జరిగే సీఎం చంద్రబాబు సభలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న అమలాపురానికి చెందిన మాలమహానాడు నాయకులు నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు, పడమట రామ్‌ప్రసాద్, గెల్లా రాజేంద్రలను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆత్రేయపురం స్టేషన్‌కు తరలించారు. ఈవిషయం తెలుసుకున్న మాలమహానాడు నాయకులు గొల్లపల్లి డేవిడ్‌రాజు, కప్పల శ్రీధర్, నెల్లి లక్ష్మిపతి, వైవీ తదితర నాయకులు స్టేషన్ వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీగత్తిపై వారిని పోలీసులు విడుదల చేశారు.

మహిళ మెడలో బంగారు తాడు అపహరణ

అంబాజీపేట, ఆగస్టు 23: ఓ మహిళ మెడలో నుంచి బంగారు తాడు, నల్లపుసలను మోటార్‌సైకిల్‌పై నుంచి ఇద్దరు వచ్చి అపహరించుకుపోయారు. గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెందిన గ్రంధి మహాలక్ష్మి శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో స్థానిక శివాలయానికి వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా ప్రధాన వీధిలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి ఆ మహిళ మెడలో ఉన్న బంగారు తాడు, నల్లపుసలతావలం లాక్కుని వెళ్లిపోయారు. తాడు, నల్లపుసలను ఆ మహిళ చేతితో గట్టిగా పట్టుకోవడంతో ఆమె చేతిలో రెండు ముక్కలు ఉండిపోగా మిగిలిన తాడు, నల్లపుసలతాడులను ఇద్దరు లాక్కుని పరారయ్యారు. ఎస్ఐ కె.చిరంజీవి, క్రైమ్‌పార్టీ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

పంటకాలువలో మత్స్యకారుడి మృతదేహం లభ్యం

అల్లవరం,ఆగస్టు23: పంటకాలువలో పడి దివ్యాంగ మత్స్యకారుడు మృతిచెందాడు. కొమరగిరిపట్నంశివారు నక్కారామేశ్వరానికి చెందిన దివ్యాంగుడు చెక్కా వెర్రియ్య(29) బుధవారంగోడిలంక ఆంజనేయస్వామిగుడి వద్ద పంటకాలువలో మోటార్‌సైకిల్‌తో పడ్డాడు. శుక్రవారం మృతదేహన్ని వెలికితీశారు. అతడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆడిటోరియానికి శంకుస్థాపన

అంతర్వేది, ఆగస్టు 23: మోరి జిల్లాపరిషత్ హైస్కూలులో పూర్వ విద్యార్థులు సమకూర్చే రూ.12లక్షలతో నిర్మించే కళావేదికకు డాక్టర్ జాన వీరభద్రప్రసాద్ (ఎంఎస్) శంకుస్థాపన చేశారు. మోరి, మోరిపోడు సర్పంచ్‌లు పసలపూడి లక్ష్మీపద్మమంగతాయారు, ముప్పర్తి గంగాత్రివేణి, ముప్పర్తి నాని, డాక్టర్ కేఎంఎల్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ముప్పర్తి త్రిమూర్తులు, ఎంపీటీసీ జాన సూర్యావతి, ముప్పర్తి సత్యశ్రీనివాసరావు, విద్యా కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మి, హెచ్ఎం కృష్ణ, నిమ్మగడ్డ బాబులు, ఉప్పుగంటి నాగమల్లేశ్వరరావుపాల్గొన్నారు.

మూడు నెలల పింఛన్లు తీసుకునే అవకాశం కల్పించాలి

మలికిపురం, ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ మూడు నెలలకు ఒకసారి తీసుకునే అవకాశం కల్పించాలని పీసీసీ అధికార ప్రతినిధి రుద్రరాజు గోపాలకృష్ణరాజు కోరారు. సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు ఆయన విజ్ఞప్తి చేశారు.